క్లుప్తంగా

యుద్ధప్రాతిపదికన పారిశుధ్య పనులు



చెత్తకుప్పలు తొలగించిన తర్వాత ఇలా..

రాజాం: మండలంలోని కంచరాం గ్రామంలో యుద్ధప్రాతిపదికన శుక్రవారం పారిశుధ్య పనులు చేపట్టారు. రోడ్లు, కాలువల్లోని చెత్తా చెదారం, ప్లాస్టిక్, పాలిథిన్ వ్యర్థాలను తొలగించారు. అనంతరం గ్రామస్తులకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అటకెక్కిన ఫ్రైడే డ్రైడే శీర్షిక పేరిట జనవరి 31వ తేదీన సాక్షి దినపత్రికలో ప్రచురితమైన వార్తా కథనానికి ఎంపీఈవో వి.శ్రీనివాసరావు స్పందించారు. ఈ మేరకు అన్ని గ్రామాల్లో ఫ్రైడే డ్రైడే కార్యక్రమ నిర్వహణపై ఆరాతీశారు. అనంతరం కంచరాం గ్రామంలో పరిశుభ్రత చర్యలకు సిబ్బందిని ఆదేశించారు. సర్పంచ్ గెడ్డావు సుబ్బమ్మ, పంచాయతీ కార్యదర్శి వెంకటరావులు చెత్త తొలగింపు పనులు చేయించారు.

2 వేల టన్నుల చెరకు క్రషింగ్ పూర్తి

రేగిడి: మండలంలోని సంకిలి ఈఐడీ ప్యారీ చక్కెర కర్మాగారంలో 2 వేల టన్నుల వరకు చెరకు క్రషింగ్ పూర్తయినట్లు అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ పట్టాభి రామిరెడ్డి శుక్రవారం తెలిపారు. విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో చెరకు నరికేందుకు తుని, అన్నవరం, కాకినాడ తదితర ప్రాంతాల నుంచి కూలీలను తీసుకువచ్చినట్లు తెలిపారు. ఈ ఏడాది 4.10 లక్షల మెట్రిక్ టన్నుల చెరకు క్రషింగ్‌ను లక్ష్యంగా చేసుకున్నామన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

బొబ్బిలి/తెర్లాం/రామభద్రపురం: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అధికారులు పోలింగ్ కేంద్రాలను శుక్రవారం సందర్శించి, వాటిలో మౌలిక సదుపాయాలు ఉన్నవీ లేనివీ పరిశీలించారు. బొబ్బిలిలో గొల్లపల్లి శ్రీవేణుగోపాల మున్సిపల్ స్కూల్‌లోని పోలింగ్ కేంద్రాన్ని ఆర్డీవో రామ్మోహనరావు, డీఎస్పీ భవ్యరెడ్డిలు.. తెర్లాం హైస్కూల్‌లోని పోలింగ్ కేంద్రాన్ని తహసీల్దారు జి.హేమంత్‌కుమార్, ఎస్ఐ సాగర్‌బాబు, ఎంఈవో త్రినాథరావు, రామభద్రపురం ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాన్ని తహసీల్దారు సులోచనరాణి, ఎంపీడీవో రత్నం, ఎస్ఐ వి.ప్రసాదరావు తనిఖీ చేశారు. ఎన్నికల నాటికి అవసరమైన మౌలిక వసతులు ఉండేలా చూడాలని సిబ్బందికి సూచించారు.

భూ రికార్డుల మార్పిడి ఫిర్యాదుపై విచారణ

వంగర: మండలంలోని శ్రీహరిపురంలో భూ రికార్డుల మార్పిడిపై అందిన ఫిర్యాదుపై తహసీల్దారు దిరిశాల ధర్మరాజు శుక్రవారం విచారణ చేపట్టారు. అక్రమంగా వెబ్‌ల్యాండ్‌లో భూ రికార్డులు మార్పు చేశారని గ్రామానికి చెందిన మహిళ శెట్టి జ్యోతి ఇటీవలకు తహసీల్దారుకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆయన రెవెన్యూ సిబ్బందితో కలిసి ఫిర్యాదులో పొందుపరిచిన పొలం వద్దకు వెళ్లి పరిశీలించారు. గ్రామస్తుల నుంచి వివరాలు సేకరించారు. గ్రామపెద్దలు, రైతుల నుంచి స్టేట్‌మెంట్లు తీసుకుంటామని, సమగ్ర దర్యాప్తు అనంతరం తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో డీటీ హరిరమణారావు, ఆర్ఐ బి.రామారావు, మండల సర్వేయర్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చెరువు.. మరమ్మతులు కరువు!

- కానరాని చెరువుల నిర్వహణ
- ముళ్లపొదలు, డొంకలతో నిండిన చెరువులు
- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందులు పడుతున్న రైతులు



ముళ్లపొదలు, డొంకలతో కొండంపేటలోని ఓ చెరువు

రాజాం సిటీ: చెరువుల నిర్వహణ ఎక్కడా కానరావడం లేదు. దీంతో ఏ చెరువు చూసినా నిండుగా ముళ్లపొదలు, తుప్పలు, డొంకలతో కనిపిస్తున్నాయి. దీంతో సరిగా సాగునీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. పంటల సాగుకు చెరువు నీటిపై ఆధారపడే రైతాంగానికి ఏటా ఈ తిప్పలు తప్పడం లేదు. ఇప్పటికైనా చెరువులు బాగు చేసి, సాగునీరు అందించాలని అన్నదాతలు కోరుతున్నారు. ఇదివరకు ఉపాధి హామీ పథకం పనుల్లో భాగంగా చెరువులను బాగుచేసే వారు. ఇప్పుడు రాజాం మున్సిపాలిటీ పరిధిలో ఏ చెరువులోనూ అటువంటి పనులు జరగకపోవడంతో చెరువులన్నీ తూడుకర్రలు, పిచ్చిమొక్కలు, ముళ్లపొదలతో కనీసం మదుములు కూడా కనిపించని దుస్థితిలో ఉన్నాయి. అటు పంచాయతీలకు, ఇటు మున్సిపాలిటీకి చెరువులు చెందకపోవడంతోనే ఈ పరిస్థితి నెలకొందని పలువురు రైతులు వాపోతున్నారు.

1250 ఎకరాల ఆయకట్టు..

నగరపంచాయతీ పరిధిలోని రాజాం, సారధి, కొత్తవలస, కొండంపేట, పొనుగుటివలస గ్రామాల్లో మొత్తం 25 వరకు సాగునీటి చెరువులు ఉన్నాయి. అయా చెరువుల పరిధిలో 1250 ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ చెరువులన్నీ వర్షాలపైనే ఆధారపడి ఉన్నాయి. అయితే ఇప్పుడు ఆ చెరువులు మరమ్మతులకు నోచుకోకపోవడంతో చెరువుల నిండా నీరున్నా మదుముల ద్వారా సక్రమంగా నీరందని పరిస్థితి. ఈ నేపథ్యంలో చెరువులు బాగుచేయిస్తే సక్రమంగా నీరంది ఏడాది పొడవునా పంటలు పండించుకునేందుకు వీలుంటుందని రైతులు అభిప్రాయపడుతున్నారు. కొన్నిచోట్ల సొంత డబ్బులతో మదుములు బాగుచేయించుకుంటున్నామని అంటున్నారు.

ఎన్నికలు జరిగిన చెరువులకే నిధులు..

రాజాం మండలంలోని చెరువులతో పాటు రాజాం మున్సిపాలిటీ పరిధిలోని సాగునీటి చెరువుల అభివృద్ధికి ఓ అండ్ ఎం(ఆపరేషన్ మెయింటెనెన్స్) నిధులకు అధికారులు ప్రతిపాదనలు పంపించారు. నీటి సంఘాల ఎన్నికలు జరిగిన చెరువులకు మాత్రమే ఈ నిధులు వర్తించడంతో మున్సిపాలిటీలో ఆ ఎన్నికలు జరగని చెరువుల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. ఓ అండ్ ఎం నిధులు కూడా శిస్తు వసూళ్ల ఆధారంగా విడుదల చేయనున్నారు. కాలువలకు సంబంధించి రూ.200, చెరువులకు సంబంధించి రూ.100లు చొప్పున రైతుల వద్ద శిస్తు వసూలు చేయనున్నారు. ఈ నిధులన్నీ సమకూరితే తప్ప పూర్తిస్థాయిలో చెరువులు బాగుపడే పరిస్థితి కనపడడం లేదు.



చెరువు మదుము వద్ద పేరుకుపోయిన తుప్పలు

మదుములు బాగు చేసుకుంటున్నాం.....

మా పంటపొలాలకు నీరందించే సాగునీటి చెరువులు పూర్తిగా తుప్పలతో నిండిపోయాయి. దీంతో పాటు మదుములు కూడా శిథిలావస్థకు చేరుకున్నాయి. వర్షాలపై ఆధారపడిన చెరువులు కావడంతో ఏటా రైతులమంతా సొంతంగా మదుములు బాగుచేసుకుంటున్నాం. అధికారులు స్పందించి, చెరువుల్లోని పూడికలు, చెరువుల్లో తుప్పలు తొలగించే ఏర్పాట్లు చేయాలి.

–గేదెల నారాయణరావు, రైతు, రాజాం

అధికారులు స్పందించాలి..

వర్షాధారంపై పండిస్తున్న పంటలకు సక్రమంగా నీరందేలా చర్యలు తీసుకోవాలి. మున్సిపాలిటీ పరిధిలోని చెరువులన్నింటి దుస్థితి అత్యంత దారుణంగా ఉంది. అధికారులు స్పందించాలి, సాగునీటి చెరువులు బాగుచేయించాలి.

–ఎస్.అప్పలనాయుడు, రైతు, రాజాం

ఓఅండ్ఎం నిధుల ప్రాప్తికి పనులు..

ఓ అండ్ ఎం నిధుల ప్రాప్తికి చెరువుల పనులు చేపట్టనున్నాం. ఇప్పటికే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రతిపాదనలు తయారు చేసి పంపించాం. మున్సిపాలిటీలోని చెరువులకు సంబంధించి కూడా ప్రతిపాదనలు తయారు చేసి పంపించాం. ముందుగా ఎన్నికలు జరిగిన చెరువులను బాగుచేసిన తర్వాత మిగతా వాటి గురించి ఆలోచన చేయనున్నాం.

–రాజేష్, ఇరిగేషన్ ఏఈ, రాజాం

• ప్రభుత్వ భూములు కాపాడండి



ప్రభుత్వ భూములను కాపాడాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ డిమాండ్ చేశారు. ఇదే విషయమై ఆయన బొబ్బిలి తహసీల్దారు కార్యాలయంలో డీటీ సుబ్బారావుకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బొబ్బిలి మున్సిపాలిటీ పరిధిలోని చెరువులు, ప్రభుత్వ స్థలాలు క్రమక్రమంగా కబ్జాకోరుల చేతుల్లోకి వెళ్లిపోతున్నాయని ఆరోపించారు. శ్రీనివాస జూట్‌మిల్లు వద్ద రెండెకరాల ప్రభుత్వ స్థలం, ఐటీఐ కాలనీ దగ్గరున్న ప్రభుత్వ పాఠశాల వెనుక స్థలం ఆక్రమణకు గురవుతోందన్నారు. దీనిపై గతంలో అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని లేకపోతే పోరాటబాట పడతామని హెచ్చరించారు. ఆయన వెంట ఆ పార్టీ నాయకుడు కోట అప్పన్న తదితరులు ఉన్నారు. –బొబ్బిలిరూరల్

• రాష్ట్రపతికి అంగన్‌వాడీల లేఖ



తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇదే విషయమై రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు రాసిన లేఖను వారు వంగర మండలం, ఎం.సీతారాంపురంలో శుక్రవారం జరిగిన ఐసీడీఎస్ సెక్టార్ సమావేశంలో ప్రదర్శించారు. తమను రెగ్యులర్ చేయాలని, ప్రభుత్వ ఉద్యోగులకు వర్తించే అన్ని బెనిఫిట్స్ తమకు వర్తింపజేయాలని కోరారు. ఇవే అంశాలపై త్వరలో రాష్ట్రపతిని కలవనున్నట్లు అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ యూనియన్ తెలిపింది. –వంగర

• ట్రేడ్ లైసెన్స్ ఫీజు బకాయిలు వసూలు చేయండి



బొబ్బిలి మున్సిపాలిటీ పరిధిలో ట్రేడ్ లైసెన్స్ ఫీజు బకాయిలను వెంటనే వసూలు చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి సిబ్బందిని ఆదేశించారు. బొబ్బిలిలోని మార్కెట్, కంచర వీధుల్లో శుక్రవారం పర్యటించిన ఆమె..రోడ్లపై ఎవరూ చెత్త వేయకుండా చూడాలని, చెప్పినా వినకుండా చెత్త వేసిన వారికి జరిమానా విధించాలని తెలిపారు. అనంతరం తాగునీటి పైపులైన్లను పరిశీలించి, లీకేజీలను అరికట్టాలని కోరారు. ఆమె వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళి తదితరులు ఉన్నారు. –బొబ్బిలి

ఫిజియోథెరపీ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

రేగిడి: దివ్యాంగులైన చిన్నారులకు భవిత కేంద్రాల ద్వారా అందించే ఫిజియోథెరపీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని వైద్యురాలు రమాచంద్రిక కోరారు. మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో దివ్యాంగ చిన్నారులకు శుక్రవారం ఫిజియోథెరపీ సేవలు అందించారు. ఆమె మాట్లాడుతూ ఇక్కడ చేసిన విధంగానే ఇంటి వద్ద కూడా పిల్లలకు ఫిజియోథెరపీ చేస్తే కొన్నాళ్లకు వైకల్యం సమసిపోయే అవకాశం ఉందన్నారు.

చంద్రబాబును మించి ఎమ్మెల్యే అబద్ధాలు



మాట్లాడుతున్న పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

రామభద్రపురం: రాష్ట్ర ఆర్థికవ్యవస్థ గూర్చి స్థానిక(బొబ్బిలి) ఎమ్మెల్యే బేబీనాయన వారి అధినాయకుడు చంద్రబాబును మించి అబద్ధాలు ఆడుతున్నారని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త శంబంగి వెంకట చినఅప్పలనాయుడు విమర్శించారు. ఇదే విషయమై ఆయన స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శుక్రవారం మీడియాతో మాట్లాడారు. వైఎస్సార్ సీపీ హయాంలో రూ.10 లక్షల కోట్లు అప్పులు చేశారని, నెలకు రూ.వేల కోట్లు వడ్డీలు, అసలు చెల్లించాల్సి వస్తోందన్న వార్తలు ఇటీవల కొన్ని పత్రికలు, వాట్సాప్‌లలో వచ్చాయని స్థానిక ఎమ్మెల్యే మాట్లాడడం సిగ్గుచేటన్నారు. ఇక్కడి నుంచే రాష్ట్ర ఆర్థిక పరిస్థితులపై అధ్యయనం చేసినట్లు మాట్లాడుతున్నారని ఎద్దేవాచేశారు. ఇప్పుడు నెలనెలా వేల కోట్లు అప్పులు చేస్తూ రాష్ట్రాన్ని అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా మారుస్తున్న వీరే ఇలాంటి మాటలు మాట్లాడం దారుణమన్నారు. 2014-19 మధ్య కాలంలో అప్పట్లో అధికారంలోని టీడీపీ ప్రభుత్వం.. ఆర్థిక విధ్వంసం చేయలేదా అని ప్రశ్నించారు. అప్పుడే వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రాన్ని ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఆక్సిజన్ పీల్చుకునే స్థితికి తీసుకొచ్చిందన్నారు. కోవిడ్ లాంటి విపత్కర పరిస్థితుల్లోనూ ఇచ్చిన మాటకు కట్టుబడి జగన్‌మోహన్‌రెడ్డి పథకాలు అమలు చేశారన్నారు. అధికారంలోకి వచ్చేందుకు ప్రజలకు మోసపూరిత హామీలు ఇచ్చి, ఇప్పుడు అవేమీ అమలు చేయలేమని చేతులు ఎత్తివేయడం మీ చంద్రబాబు ప్రభుత్వానికే చెల్లిందన్నారు. సంక్రాంతి పండగ తర్వాత నుంచి ధాన్యం కొనుగోలు లేవని, రైతులు విక్రయించిన ధాన్యానికి కూడా బిల్లులు పడక రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. చంద్రబాబు మోసాలను ప్రజలంతా గమనిస్తున్నారని, సమయం చూసి వారే తగిన బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, పాలసొసైటీ అధ్యక్షుడు చొక్కాపు రామకృష్ణ, మండల జేసీఎస్ కన్వీనర్ చింతల సింహాచలంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా ఫీవర్ సర్వే

రాజాం: మండలంలోని బొద్దాం, పెనుబాక, గార్రా జుచీపురుపల్లి, శ్యాంపురం తదితర గ్రామాల్లో ఫీవర్, లెప్రసీ సర్వేలు శుక్రవారం చురుగ్గా జరిగాయి. బొద్దాం పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ సిద్ధేశ్వరి ఆయా సర్వేలను పరిశీలించారు. ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని, ఆరోగ్య సమస్యలు తలెత్తితే వైద్యులను సంప్రదించాలని సూచించారు.

వినతిపత్రం అందజేత

రాజాం: మున్సిపల్ కార్మికులకు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కల్పించడంతో పాటు 62 ఏళ్ల వయసు నిండిన కార్మికుల పిల్లలకు మున్సిపల్ కార్యాలయాల్లోనే ఉద్యోగాలు ఇవ్వాలని సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎ.జగన్మోహనరావు డిమాండ్ చేశారు. ఇదే విషయమై స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన చేపట్టారు. కార్మికులతో కలిసి ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో జరిగిన రాతపూర్వక ఒప్పందాలకు ప్రస్తుత ప్రభుత్వం జీవోలు జారీ చేయకపోవడంతో కార్మికులకు తీవ్ర నష్టం జరుగుతోందన్నారు. 60 ఏళ్లకే కార్మికులను పనిలో నుంచి తీసేసి ఇంటికి పంపించడం దారుణమన్నారు. పదేళ్ల సర్వీసు పైబడి ఉన్న కార్మికులకు రూ.70 వేలు వేతనం ఇవ్వాలని, ఆపై ప్రతీ ఏటా రూ.2 వేలు చొప్పున ఇంక్రిమెంట్ ఇస్తున్నట్లు జీవో జారీ చేయాలని కోరారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు శ్రీను, రాజేష్, రవి, సింహాచలం, రఘు, శ్యామల, అప్పలరాం తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేయడంలో చంద్రబాబు దిట్ట

బొబ్బిలి: ప్రజలను మోసం చేయడంలో సీఎం చంద్రబాబు దిట్ట అని ఏఐవైఎఫ్(ఆలిండియా యూత్ ఫెడరేషన్) రాష్ట్ర నాయకుడు ఎం.యుగంధర్ అభివర్ణించారు. మండల కేంద్రంలోని గంటి ప్రసాదం స్మారక భవనంలో శుక్రవారం జరిగిన ఏఐవైఎఫ్ జిల్లా మహాసభలకు హాజరైన ఆయన.. ఎన్నికల సమయంలో ఎలాగైనా అధికారంలోకి రావాలని కూటమి నాయకులు అమలు సాధ్యం కాని హామీలు ఇచ్చి జనానికి ఆశ చూపారని, తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలు అమలులో చేతులెత్తేశారని ధ్వజమెత్తారు. 2014 ఎన్నికల్లో కూడా ఇలానే హామీలు ఇచ్చి, అమలు చేయకపోతే ప్రజలు ప్రతిపక్షంలో కూర్చోబెట్టిన సంగతి గుర్తు లేదా అని దుయ్యబట్టారు. ప్రజలంతా చంద్రబాబు అబద్ధాలు, మోసాలు గమనిస్తున్నారని, వారే సరైన సమయం చూసి బుద్ధి చెబుతారన్నారు. అమరావతిని ఫ్రీజోన్ చేసి, అన్ని ప్రాంతాల వారికి సమానంగా ఉద్యోగావకాశాలు లభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ, కోట అప్పన్న, ఎ.ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

పక్కాగా ఎన్నికల కోడ్ అమలు చేయాలి

తెర్లాం: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో విడుదలైన ఎన్నికల కోడ్ పక్కాగా అమలు చేయాలని తహసీల్దారు జి.హేమంత్ కుమార్, ఎంపీడీవో ఆర్.రాంబాబు సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో వీఆర్‌వోలు, పంచాయతీ కార్యదర్శులతో శుక్రవారం సమావేశమైన వారు ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున రాజకీయ నాయకుల ఫొటోలతో కూడిన బ్యానర్లు, ప్రభుత్వ పథకాల ఫ్లెక్సీలు తొలగించాలన్నారు. ఎన్నికల ప్రచారం చేయాలంటే ఎన్నికల రిటర్నింగ్ అధికారి, విశాఖపట్నం జిల్లా కలెక్టర్ నుంచి అనుమతులు తెచ్చుకోవాలన్నారు. ఎన్నికల మోడల్ కోడ్ ఆఫ్ కాండాక్ట్ అమలు చేసే బాధ్యతను అందరూ తీసుకోవాలన్నారు.

అభ్యసన సామర్థ్యాలు మెరుగుపరచాలి

తెర్లాం: మండలంలోని గంగన్నపాడు ప్రాథమిక పాఠశాలను ఎంఈవోలు జె.త్రినాథరావు, ఆర్.పాపారావు శుక్రవారం సందర్శించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు, పాఠశాల రికార్డులు, పిల్లల హోమ్‌వర్క్, చేతిరాత పుస్తకాలు, తాగునీరు, మరుగుదొడ్లు, మధ్యాహ్న భోజన పథకం వంటకాలను వారు పరిశీలించి, పలు సూచనల చేశారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు మెరుగుపరచాలన్నారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం వంటకాలు చేయాలని తెలిపారు. మరుగుదొడ్లు పరిశుభ్రంగా లేకపోతే స్కావెంజర్స్‌పై చర్యలు తీసుకుంటామన్నారు.

రైస్‌మిల్లుల్లో ఆకస్మిక తనిఖీలు

బాడంగి: మండల కేంద్రంలోని వెంకటపద్మ రైస్‌మిల్లులో సీఎస్‌డీటీ స్వర్ణలత శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ప్రతినెలా సివిల్ సప్లయి గొడౌన్‌లకు పీడీఎస్ బియ్యం తరలించేటప్పుడు విధిగా వేలిముద్రలు వేయాలని మిల్లు యజమానులకు ఆమె సూచించారు.

మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

బొబ్బిలి: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కౌన్సిల్ సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఇదే సమావేశానికి హాజరైన మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణ.. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున సమావేశంలో ఎటువంటి అంశాలపై చర్చ జరగకుండానే సమావేశం ముగిసింది.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి చర్యలు

బాడంగి: రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తహసీల్దారు కె.సుధాకర్ తెలిపారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో గతంలో జరిగిన రెవెన్యూ సదస్సుల్లో అధికారుల దృష్టికి వచ్చిన సమస్యలు-వాటి పరిష్కార చర్యలపై శుక్రవారం సిబ్బందితో సమీక్షించారు. రెండు సదస్సుల్లో మొత్తం 1103 సమస్యలపై దరఖాస్తులు వచ్చాయని, వాటిలో ఇప్పటివరకు 270 సమస్యల వరకు పరిష్కరించడం జరిగిందన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

రేగిడి: మండల కేంద్రంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయం ట్రైనీ మాస్టర్ కిరణ్‌కుమార్, ఐసీఆర్‌పీలు రమణ, తవిటినాయుడులు ప్రకృతి సేద్యం-దాని ప్రయోజనాలను వివరించారు. ప్రకృతి సాగు ద్వారా ఆరోగ్యవంతమైన పంట, అధిక దిగుబడులు వస్తాయన్నారు.

సమయపాలన పాటించండి

రాజాం సిటీ: సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని ఆగూరు, డీఆర్ఎస్‌వలస, గడిముడిదాం గ్రామ సచివాలయాలను ఆయన శుక్రవారం సందర్శించి, పలు సూచనలు చేశారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున రాజకీయ బ్యానర్లు, జెండాలు, హోర్డింగ్‌లు లేకుండా చూడాలని తెలిపారు.

ఆరోగ్య తనిఖీలు

రేగిడి: మండలంలోని దేవుదళ, బూరాడ, ఉంగరాడ, చిన్నశిర్లాం, పెద్దశిర్లాం తదితర గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు శుక్రవారం ఆరోగ్య తనిఖీలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు అందజేసి, ఆరోగ్య సూత్రాలు తెలిపారు.

ఆర్థికంగా ఎదగాలి

రేగిడి: మహిళా సంఘాలు ఆర్థికంగా ఎదగాలని ఏపీఎం పి.గోవిందరావు ఆకాంక్షించారు. మండలంలోని ఆమదాలవలస గ్రామంలో గ్రామైక్య సమావేశం శుక్రవారం నిర్వహించారు. మహిళా సంఘాల పొదుపు రికార్డులను ఆయన పరిశీలించి, పొదుపు నిల్వలతో పాటు స్త్రీనిధి రుణాల వినియోగం, చెల్లింపులపై ఆరాతీశారు.

'మత్తు'తో జీవితం నాశనం

బాడంగి: గంజాయి, ఖైనీ, గుట్కా, మద్యం వంటి మత్తు పదార్థాలతో జీవితం నాశనమవుతుందని సీఐ నారాయణరావు సూచించారు. సంకల్పం కార్యక్రమంలో భాగంగా మండలంలోని కోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్ప్రభావాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఫ్యాషన్ మాయలో పడి విద్యార్థులు, యువత చెడు వ్యసనాలకు బానిసలై తమ బంగారు భవిష్యత్ చెడగొట్టుకుంటున్నారన్నారు. ప్రతిఒక్కరూ మంచి అలవాట్లు అలవర్చుకోవాలన్నారు.

పింఛన్ల పంపిణీలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

తెర్లాం: మండలంలో శనివారం చేపట్టనున్న పింఛన్ల పంపిణీలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలకు వెనుకాడేది లేదని ఎంపీడీవో రాంబాబు హెచ్చరించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో శుక్రవారం సమావేశమై, పింఛన్ల పంపిణీపై దిశానిర్దేశం చేశారు. అన్ని గ్రామ సచివాలయాల పరిధిలో ఉదయం 5.30 గంటలకే పింఛన్ల పంపిణీ ప్రారంభం కావాలన్నారు.

క్షయవ్యాధి నిర్మూలనపై అవగాహన

సంతకవిటి: మండలంలోని వాసుదేవపట్నంలో క్షయవ్యాధి నిర్మూలనపై శుక్రవారం అవగాహన కల్పించారు. జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమంలో భాగంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో వ్యాధి లక్షణాలు, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వైద్యులు తెలిపారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

రాజాం: మండలంలోని గడిముడిదాం గ్రామంలో రూ.10 లక్షల అంచనా వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణం శుక్రవారం చేపట్టారు. ఎంపీడీవో వి.శ్రీనివాసరావు ఆ పనులను పరిశీలించి, నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు.